# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-08-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వోకల్ ఫర్ లోకల్ ద్వారా చేనేత వస్త్రాలకు ప్రచారం కల్పించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ పేర్కొన్నారు.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో సమావేశమైంది.**

3. **చేనేత కార్మికుల ప్రయోజనాలు, స్వయం సమృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

4. **రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు కౌలును మరో ఐదేళ్ళపాటు పొడగిస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

5. **రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.**

6. **విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి ఈరోజు.**

==========================

దేశవ్యాప్తంగా ఈరోజు పదవ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన నేత కార్మికులకు సంత్ కబీర్ పురస్కారాలు ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలక భూమికను పోషిస్తున్న చేనేత రంగపు ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వోకల్ ఫర్ లోకల్ ద్వారా చేనేత వస్త్రాలకు ప్రచారం కల్పించాలని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ..

వాయిస్ (25 సెకన్లు)

ఇలా ఉండగా, జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. సుసంపన్నమైన భారత దేశపు వారసత్వానికి చేనేత ప్రతీకగా నిలిచిందన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేనేత దినోత్సవం సందర్భంగా ఈరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తోంది.

కాగా... రాష్ట్రంలో మరో 12 నుంచి 14 ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఎయిర్ స్ట్రిప్ లను నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులపై నిన్న అమరావతి రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కుప్పం, దగదర్తి, నాగార్జున సాగర్, మూలపేటలో విమానాశ్రయాలను నిర్మిస్తామన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడ జిల్లా తునిలో కూడా విమానాశ్రయాలను నిర్మించేందుకు అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయాల ద్వారా సరకు రవాణా చేసే ప్రాజెక్టులను రూపొందించాలని అన్నారు.

-------------------------

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో మొక్కలు నాటడంతో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అమలుజేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధికారులను ఆదేశించారు. నిన్న విజయవాడలోని రాజ్‌భవన్ ప్రాంగణంలో గవర్నర్ దంపతులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చర్యలూ చేపట్టాలన్నారు. మొక్కల పెరుగుదలను పర్యవేక్షించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద విద్యాసంస్థల్లో డ్రైనేజీ వ్యవస్థలు, స్వచ్ఛాలయాలు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత పనులను చేపట్టాలని విశ్వవిద్యాలయాల ఉపకులపతులకు గవర్నర్ సూచించారు. ఈ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖ అధికారులకు స్పష్టం చేశారు.

-------------------------

ఉమ్మడి రాజధానిగా గడువు తీరగానే ఆంధ్రప్రదేశ్ క్యాబ్ డ్రైవర్లు హైదరాబాద్‌లో ఉండకూడదంటూ అడ్డుకోవడం సరి కాదని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రాజధాని పనులు ప్రారంభంకాగానే ఇక్కడి డ్రైవర్లకు ఉపాధి మెరుగవుతుందని, అప్పటి వరకూ సాటి డ్రైవర్లను మానవతా దృక్పథంతో చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆల్ తెలంగాణ తాత్కాలిక పర్మిట్ తీసుకుని క్యాబ్‌లు నడుపుతున్న వారిని అక్కడివారు అడ్డుకుంటున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-------------------------

చేనేత కార్మికుల ప్రయోజనాలు, స్వయం సమృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల నుండి నిర్మలా కాన్వెంట్ రోడ్డు, పంట కాలువ రోడ్డు మీదుగా ఈరోజు చేపట్టిన చేనేత కార్యక్రమాన్ని మంత్రి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేత కార్మికులను ఆర్ధికంగా ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. చేనేతకు పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి పేర్కొంటూ,

..వాయిస్.. 15 సెకన్లు

-------------------------

రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు కౌలును మరో ఐదేళ్ళపాటు పొడగిస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో కలుపు మొక్కలు, చెత్త తొలగింపు పనులను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సుమారు 24వేల ఎకరాలను శుభ్రం చేస్తున్నామని, నెలలోపు ఈ పనులు పూర్తిచేస్తామన్నారు.నిర్మాణంలో ఉన్న భవనాల నాణ్యతను ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ చెన్నై నిపుణులు పరిశీలించారని.. త్వరలో ప్రాథమిక నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తారని తెలుపుతూ..

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

విశ్వకవిగా, తత్వవేత్తగా ప్రపంచ ఖ్యాతి నార్జించిన రవీంద్రనాధ్ ఠాగోర్ వర్ధంతి సందర్భంగా ఈరోజు ఆ మహనీయునికి అంజలి ఘటిస్తున్నాం. కవిగా, చిత్రకారునిగా, గాయకునిగా, తత్వవేత్తగా, బహుముఖ ప్రజ్ఞశాలిగా పేరొందిన రవీంద్రుడు 1861 మే 7వ తేదీన కోల్ కొతాలో జన్మించారు. 'జనగణమన' జాతీయ గీతంతో పాటు గీతాంజలి, గోరా లాంటి అద్భుత రచనలు చేశారు. ఎన్నో చిత్రాలను గీయడంతో పాటు శాంతినికేతన్ ను నెలకొల్పిన ఆ మహనీయులు 1941 ఆగష్టు 7వ తేదీన పరమపదించారు.

---------------------------

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సామాజిక మాధ్యమం వేదికగా ఆయనకు నివాళులర్పించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక దార్శనిక కవి, తత్త్వవేత్త, దేశభక్తుడు అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, భావాలు భారత్‌తో పాటు ప్రపంచాన్ని ప్రభావితం చేశాయన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతిలో బిజెపి నాయకులు ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మరోవైపు.. గీతాంజలి నవలతో నోబెల్ బహుమతి అందుకుని..జాతీయ గీతాన్ని అందించిన మహోన్నత వ్యక్తి రవీంద్ర నాథ్ ఠాగూర్ అని బిజెపి చిత్తూరుజిల్లా అధ్యక్షులు జగదీష్ నాయుడు కొనియాడారు. చిత్తూరులోని బిజెపి కార్యాలయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఈరోజు నిర్వహించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అల్లూరి సీతారామరాజు, బాపట్ల, కృష్ణా, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

---------------------------

నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 70 గేట్లను పైకెత్తి 73 వేల 227 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మరోవైపు కాల్వల ద్వారా 13 వేల 477 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాత్రికి లక్షన్నర

క్యూసెక్కులకు చేరుకునే అవకాశముందని అధికారులు తెలిపారు. బ్యారేజీ నుంచి వరద నీటిని విడుదల చేయడంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. కాల్వల ద్వారా విడుదల చేసే వరదనీరు పూడిక ప్రభావంతో రహదారుల పైకి చేరుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

---------------------------

రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 14వ తేదీన కృష్ణా జిల్లాలో జాతీయ లోక్అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక ఒక ప్రకటనలో తెలిపారు. లోక్అదాలత్ ద్వారా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు.

=======================